www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 29 ఫిబ్రవరి 2024
5
తూర్పుగోదావరి



1 నుంచి అందుబాటులోకి బిఎంసియు

ప్రజాశక్తి-రాజానగరం

మార్చి 1 నుంచి భూపాలపట్నం బిఎంసియు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ తెలిపారు. భూపాలపట్నంలో ఏర్పాటు చేయనున్న బిఎంసియును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి తేజ్ భరత్ మాట్లాడుతూ గుజరాత్ నుంచి పాల శీతలీకరణ పరికరాలు చేరాయని, వాటిని అసెంబుల్ చేసి ట్రైల్ రన్ పూర్తి చెయ్యాలన్నారు. జిల్లాలో అమూల్ పాల సేకరణ కేంద్రాల ద్వారా పాడి రైతులకు సరైన మద్దతు ధరను అందిస్తూ పాల సేకరణ ప్రక్రియ వేగవంతం చేస్తున్నట్టు చెప్పారు. జగనన్న పాల వెల్లువ అమూల్ కేంద్రాల ద్వారా పాలసేకరణ చేపడుతున్నట్టు చెప్పారు. జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎస్‌జిటి సత్య గోవింద్, ఎపి ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ టివిఎస్ఎన్.మూర్తి, ఎంపిడిఒ జివికెఎన్‌వి జ్యోతిర్మయి ఉన్నారు.

టిడిపి, జనసేనలో టికెట్ల లొల్లి

- తొలి జాబితాతోనే జిల్లాలో మంటలు
- నేతి బీర చందంగా పరస్పర సహకారం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

టిడిపి, జనసేన పొత్తు రెండో జాబితా కోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారు. జనసేనకు సీట్ల కేటాయింపుపై టిడిపి నేతల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవల విడుదల చేసిన తొలి జాబితాతోనే జిల్లాలో మంటలు మొదలైన విషయం విదితమే. ప్రకటించిన మూడు నియోజకవర్గాల్లో జనసేనకు ప్రకటించిన రాజానగరంలో ఆ పార్టీ అభ్యర్థి బత్తుల బలరామకృష్ణకు టిడిపి నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లభించడం లేదు. రాజమహేంద్రవరం సిటీ టిడిపి అభ్యర్థిగా ఆదిరెడ్డి వాసును ప్రకటించిన విషయం విదితమే. అయితే జనసేనకు ఈ నియోజకవర్గంలో పట్టు ఉన్నప్పటికీ వ్యతిరేకించలేదు. రాజమహేంద్రవరం రూరల్ స్థానాన్ని ఆశించిన జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్‌కు నిరాశే మిగిలింది. తాజాగా నిడదవోలులో పోటీ చేయాలనడంతో పార్టీ శ్రేణుల్లో కలవరం మొదలైంది. టిడిపి, జనసేన పొత్తు జిల్లాలో మరో 4 సీట్లతో పాటు ఎంపీ స్థానాన్ని ప్రకటించాల్సి ఉంది. ఇప్పటికి ప్రకటించిన మూడు నియోజకవర్గాల్లో రాజమహేంద్రవరం అసెంబ్లీ, అనపర్తిలో మాత్రమే సానుకూల పరిస్థితులు నెలకొన్నాయి. ఇక రెండో జాబితా విడుదలైతే నేతలు భగ్గుమనటం ఖాయమని తెలుస్తోంది. టిడిపిలో తమకు తిరుగు



లేదని, తొలిగా తమపేరే ఉంటుందని భావించిన కొందరు ఇప్పుడు డైలమాలో పడ్డారు. మలి జాబితా ఎప్పుడు ప్రకటిస్తారోనని ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా జనసేనకు ఏ సీట్లు కేటాయిస్తారోననే ఉత్కంఠ నెలకొంది. నిడదవోలు నియోజకవర్గంలో బూరుగుపల్లి శేషారావు వరుసగా పలుమార్లు ఎంఎల్‌ఎగా గెలిచిన విషయం విదితమే. కొవ్వూరు నియోజకవర్గలో మాజీ మంత్రి కెఎస్ జవహర్‌కు సైతం స్థానం లభించలేదు. టిడిపి సీనియర్ నాయకులు గోరంట్ల బుచ్చయ్య చౌదరికి సైతం తొలి జాబితాలో మొండి చేయి తప్పలేదు. గోపాలపురం నియోజకవర్గంలోనూ మద్దిపాటి వెంకటరాజు పేరును గతంలో అధినేత చంద్రబాబు స్వయంగా ప్రకటించినప్పటికీ తొలి జాబితాలో స్థానం లభించలేదు. తాజాగా రాజమహేంద్రవరం రూరల్ స్థానాన్ని టిడిపికి కేటాయించినట్లు స్పష్టం చేయటంతో జనసేనలో నిరసన గళం వ్యక్తమవుతోంది. జనసేన జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్‌కు మద్దతుగా అభిమానులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అధికార పార్టీ నేతలు సైతం కందుల దుర్గేష్‌కు అన్యాయం జరిగిందంటూ వాఖ్యలు చేయడం కొసమెరుపు. రాజానగరం నియోజకవర్గంలో అసెంబ్లీ స్థానం ఆశించి బొడ్డు వెంకట రమణ చౌదరి భంగపడ్డారు. అయితే ప్రత్యేకించి ఒక సామాజిక వర్గానికి చెందినవారందరినీ తొలి జాబితాలో ప్రకటిస్తే విమర్శలకు దారి తీయవచ్చనే భావనతో ఆ పేర్లను మలి జాబితాలో చేర్చబోతున్నట్లు తెలిసింది. జిల్లాలో సాధ్యమైనంత మేర ఎక్కడైనా అలకలు, అసంతృప్తులు ఉంటే వీటన్నిటినీ సద్దుమణిగేలా చేయాలని జనసేన అధినాయకత్వం భావిస్తోంది.

భవన నిర్మాణ కార్మికుల దీక్ష

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలని నియోజకవర్గస్థాయి నిరాహార దీక్షలు బుధవారం కొవ్వూరు బస్టాండ్ వద్ద సంఘ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టారు ఈ సందర్భంగా జరిగిన సభకు సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లేపల్లి నరసింహమూర్తి అధ్యక్షత వహించారు. నిర్మాణ కార్మికుల దీక్షలకు టిడదిపి నాయకులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని రామ్మోహన్ రావు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలను చంద్రన్న బీమా ద్వారా అందించమని చెప్పారు. శిబిరంలో వైసిపి నాయకులు పరిమి హరిచరణ్, జనసేన కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి టివి.రామారావు, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ యార్లగడ్డ శ్రీనివాసరావు, యాళ్ల వరప్రసాద్, ఎం.రఘురామ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందరబాబు మాట్లాడారు. దీక్షలో మైగాపుల నాగేశ్వరరావు, వల్లేపల్లి నరసింహమూర్తి, మద్దుకూరి దొరయ్య, జొన్నల రాంబాబు, కృష్ణ, వీరా త్రిమూర్తులు, మారెళ్ల కనుక శ్రీను, మసకపల్లి శ్రీను, కె.సతీష్, మాధవరపు శ్రీనివాస్, పోతురాజు దీక్షలో కూర్చున్నారు.

హమాలీల నిరసన

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు ప్రభుత్వ అబ్కారీ గొడౌన్‌లో పనిచేస్తున్న కార్మికులు బుధవారం హమాలీల సంఘం అధ్యక్షుడు చింతలపూడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మద్యం డిపోలో ఎగుమతి దిగుమతి కూలీ రేటు పెంచాలని, కొత్త కాంట్రాక్టర్లచే కొత్తగా పెంచిన రేట్లు చెల్లించేలా యజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ

నేడు ధర్నాలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల సాధన కోసం రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు గురువారం నిర్వహించే ధర్నాలను అధిక సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొనే జయప్రదం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు కోరారు. అన్ని కేంద్రాల్లో సాయంత్రం నాలుగు గంటల నుండి గంటలు 5:30 గంటల వరకూ ఈ ధర్నాలు నిర్వహిస్తారని తెలిపారు.



చెక్కు అందిస్తున్న కలెక్టర్, జెసి

రైతు భరోసా, సున్నా వడ్డీ రుణాలు జమ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పిఎం కిసాన్ వైఎస్ఆర్ రైతు భరోసా-పథకం, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలు పథకంలో తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి రైతులకు ఆర్థిక సాయం వర్చువల్‌గా రైతుల బ్యాంకు ఖాతాలకు బుధవారం జమ చేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత, జెసి ఎన్.తేజ్ భరత్, రైతులు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుకు విత్తనం నుంచి విక్రయం వరకు ఆర్థికంగా భరోసా అందిస్తోందని చెప్పారు. జిల్లాకు చెందిన రైతాంగానికి ఆర్థిక సాయం కింద పంట సాయం అందించడంతో పాటు, వారు తీసుకున్న బ్యాంకు రుణం కోసం చెల్లించిన వడ్డీ రాయితీని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 2021-22 రబీకి చెందిన 17,409 మంది రైతులకు రూ.3,40,08,955లు, 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన 13,305 మంది రైతులకు రూ.2,45,61,019 వెరసి 30,714 మంది రైతుల ఖాతాలకు రూ.5,85,69,974ను సున్నా వడ్డీ రాయితీ మేర ప్రయోజనం పొందినట్లు కలెక్టర్ తెలిపారు. వరుసగా 5వ ఏడాది 3 విడతగా వైయస్సార్ రైతు భరోసా పిఎం కిసాన్ పథకం కింద జిల్లాలోని 14,1216 మంది రైతులకు రూ.28,39,04,000 వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, అధికారులు, రైతులు కొత్తపల్లి కేశవ రామారావు, కురుమళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

జాబ్ మేళా యువతకు వరం కావాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాజమండ్రి జాబ్ మేళా అనగానే నిరుద్యోగులకు వరం కావాలే కానీ, వారి ఆశలపై నీళ్ళ చల్లేలా ఉండకూడదనిఎంపీ, వైసిపి సిటీ కోఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అన్నారు. బుధవారం నగరంలోని విఎల్.పురం, మార్గాని ఎస్టేట్స్‌లో సుమారు నాలుగెకరాల విస్తీర్ణంలో నిర్వహించిన 'మెగా జాబ్ మేళా'ను ఎంపీ భరత్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. జాబ్ మేళా ఒక ప్రహసనంగా కాక, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేదిగా, వారి జీవితానికి ఒక భరోసా కల్పించేదిగా ఉండాలన్నారు. జాబ్ మేళా నిర్వహించడం.. అభ్యర్థులను ఎంపిక చేసుకుని వారి పెర్ఫార్మెన్స్ బాగుండలేదనే అసంతృప్తితో ఒకటీ రెండు నెలలకే తొలగించడం చాలా బాధాకరం అన్నారు. ఎంపిక చేసుకునే ముందే అభ్యర్థులకు కంపెనీ నిబంధనలు తెలియజేయడంతో పాటు, వారికి లాకింగ్ పీరియడ్ ఆరు నెలలు ఉండాలని సూచించారు. తగు శిక్షణ ఇచ్చి, ఉద్యోగ భద్రత కల్పిస్తే..జాబ్ మేళా నిర్వహణకు ఒక సార్ధకత ఏర్పడుతుందని ఎంపీ భరత్ అభిప్రాయపడ్డారు. ఈ జాబ్ మేళాకు ఒక్క తూర్పు గోదావరి జిల్లా నుంచే కాకుండా కాకినాడ, కోనసీమ, ఏలూరు తదితర జిల్లాల నుంచి విశేష సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైసిపి లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, డిఆర్‌డిఎ పీడీ ఎన్వీవీఎస్ మూర్తి, ఎంప్లాయ్మెంట్ ఆఫీసర్ కె.హరిశ్చంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు



ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటరుగా నమోదు చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ మాధవీలత తెలిపారు. జాయింట్ కలెక్టరు ఎన్.తేజ్ భరత్, డిఆర్ఒ జి.నరసింహులుతో కలిసి బుధవారం పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులను పరిశీలించి, తగిన ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైన చోట్ల మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వికలాంగుల కోసం ర్యాంపులు ఉండేలాగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నడవలేని వృద్ధులు, 40 శాతం పైబడిన వికలాంగుల కోసం ఫారం 12 డి ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఇంటి వద్ద నుంచే వారు ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని చెప్పారు. జిల్లాలోని 1569 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 16,05,762 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు ఫారం 6 కింద 20,403 దరఖాస్తులు రాగా 18,572 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. ఫారం7 క్రింద 20, 820 దరఖాస్తులు వచ్చాయని వాటిలో 13, 920, ఫారం 8 కింద 30,608 దరఖాస్తులు రాగా 28,801 పరిష్కరించి ఓటరు జాబితాలో సంవరించామన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు నలబాటి రమేష్ (కాంగ్రెస్), వై.రాజశేఖర్, రాయుడు గణేష్ (వైసిపి) సిహెచ్.శ్రీనివాస రావు (టిడిపి) బి.రామచంద్ర రావు (బిజెపి) కలెక్టరేట్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థినికి అస్వస్థత

ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని వీరలంకపల్లిలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని అస్వస్థతకు గురైన సంఘటనలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై బాలిక తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన సుంకర భాను గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. వారం రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధ పడుతూ ఉండడంతో తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు తెలిపారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు భానుని గోకవరం ప్రభుత్వాసుపత్రిలో చూపించారు. ఆమె అనారోగ్య విషయమై తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదు. ఆసుపత్రి నుంచి హాస్టల్‌కు భానుని తీసుకువెళుతుండగా ఆమె తండ్రి సుంకర వెంకటరమణ గోకవరంలో కుమార్తెను చూసి నిర్ఘాంతపోయాడు. తల్లిదండ్రులు హాస్టల్‌కు వెళ్లి తమ కుమార్తెను చూపించమని అడగగా ప్రిన్సిపల్ మంజుల వేణిరాణి ఒప్పుకోలేదని, పాఠశాలకు చెడ్డ పేరు వస్తుందని ముఖం చాటేసారని వారు తెలిపారు. కనీసం తమ కుమార్తెను చూపించమని కోరగా ఉపాధ్యాయులు భానుని 100 అడుగుల దూరం నుంచి చూపించారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మరో నాలుగు రోజులు హాస్టల్లోనే ఉంటే తమ కుమార్తె దక్కదని తెలిసి వెంటనే తీసుకువెళ్లి ప్రైవేట్ హాస్పిటల్లో చూపించామని చెప్పారు. అందరి పిల్లలు తల్లిదండ్రులనూ ప్రిన్సిపల్ ఇలాగే ఇబ్బందులు పెడుతున్నారని వారు తెలిపారు. ప్రిన్సిపల్‌పై తగిన చర్యలు తీసుకుని వేరొక ప్రిన్సిపల్‌ను నియమించాలని తల్లిదండ్రులు కోరారు. ఈ విషయమై ప్రిన్సిపల్ మంజుల వేణిరాణిని వివరణ కోరగా విద్యార్థిని నీరసంగా ఉండడంవల్ల ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యం అందించామని, నిబంధనల మేరకే ఏ విద్యార్థికైనా ముందుగా వైద్యం అందించి తరువాత తల్లిదండ్రులకు సమాచారం అందజేస్తామని తెలిపారు.



ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న భాను

పశువులకు వైద్య చికిత్స

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలం మార్కొండపాడులో బుధవారం నిడదవోలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన సుంకవల్లి రమేష్ ఆర్థిక సహకారంతో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 52 గేదెలు, 18 ఆవులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. 202 పశువులకు నట్టల నివారణ మందులను అందజేసారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణ పశు వైద్యులు డాక్టర్ యు.ముఖేష్, డాక్టర్ రాజేష్ వైద్య సేవలు అందజేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మహా గర్జన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నిడదవోలు

మార్చ్ 3న విశాఖలో జరిగే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మహా గర్జన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు చెల్లించకుండా లక్షలాది మంది కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు అన్ని కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులర్, సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ.26 వేలపై నిర్దిష్టమైన హామీని పొందుపరచాలన్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పదవ తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి వివిధ సమన్వయ శాఖల అధికారులు సిబ్బందితో డిఆర్ఒ నరసింహులు బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లాలో 2024 మార్చి 18 నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు సంబంధించి మొత్తం 30,116 మంది హాజరుకానున్నారని, వీరిలో బాలురు 15,819 మంది, బాలికలు 14,297 మంది ఉన్నారని తెలిపారు. వీరిలో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 29,990 మంది కాగా ఒఎస్ఎస్‌సి ప్రైవేట్ విద్యార్థులు 126 మంది ఉన్నారన్నారు. జిల్లాలో 137 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులను 8.45కు కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. ఆలస్యంగా వచ్చిన వారిని కేంద్రంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు నిర్వహించే ఈ పరీక్షలను ఎంతో జాగ్రత్తగా నిర్వహించాలని అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండి ఎటువంటి పొరబాట్లు దొర్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. మాస్ కాపీయింగ్‌ను నిరోధించేందుకు 5 ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశామని, స్క్వాడ్స్ ప్రతిరోజూ ఆయా కేంద్రాలను తనిఖీ చేస్తాయని తెలిపారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరీక్షల విధుల్లో ఉన్నవారు మినహా బయటి వ్యక్తులను కేంద్రాల్లోకి అనుమతించరని చెప్పారు. ఈ సమావేశంలో ఎఎస్‌పి పి.అనిల్ కుమార్, డిఇఒ కె.వాసుదేవరావు, డిప్యూటీ డిఇఒ ఇవిఎస్ఎస్-ఎస్‌విఎల్.నారాయణ, కెఎస్ఎంవి.కృష్ణారావు, ఎన్‌వి.సత్యనారాయణ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డిఆర్ఒ నరసింహులు

నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తా : ఎంపీ భరత్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, ఎంఎల్‌ఎగా ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఎంపీ, వైసిపి సిటీ కోఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ తెలిపారు. బుధవారం నగరంలోని 24వ వార్డులో ఆయన ఇంటింటికీ వెళ్ళి సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వార్డులో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. చిన్న వ్యాపారాలతో ఆయన ముచ్చటించారు. తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. గోదావరి గట్టును హైదరాబాదు టాంక్ బండ్‌లా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ భరత్ వెంట వైసిపి నాయకులు అజ్జరపు వాసు, అరవ సురేష్, బెజవాడ రాజ్‌కుమార్, కాంతారామ్ పటేల్, అందనాపల్లి సత్యనారాయణ, యాజ్జవరపు మరిడయ్య, యాజ్జవరపు శ్రీను నాయకులు పాల్గొన్నారు.

మార్చి 16న లోక్ అదాలత్


కొవ్వూరు రూరల్ : మార్చి 9న జరుగవలసిన జాతీయ లోక్ అదాలత్ మార్చి 16న చేయడం జరుగుతుందని కొవ్వూరు మండల న్యాయసేవాధికారాసంస్థ చైర్మన్ 9వ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయసేవాధికారాసంస్థ నుంచి ఉత్తర్వులు విలువడ్డాయని, ఈ విషయాన్నీ గమనించి న్యాయవాదులు, కక్షిదారులు తమ కేసులను మార్చి 16న రాజీ చేసుకుకనే సంసిద్దులు అవ్వాలని జడ్జి డా. ఎన్. శ్రీనివాసరావు సూచించారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌కు శిక్షణ

ప్రజాశక్తి-చాగల్లు

స్థానిక మండల కార్యాచయంలో ఎంపిఇఒ ఎన్.బుజ్జి అధ్యక్షతన ఇంజనీరింగ్ అసిస్టెంట్స్‌కు బుధవారం మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్‌పై శిక్షణ నిర్వహించారు. మండలంలో ఉన్న వివిధ ఫ్యాక్టరీలను ఇంజనీరింగ్ అసిస్టెంట్ సందర్శించి వాటి వివరాలను యాప్‌లో పొందుపరిచి సంబంధిత ఫ్యాక్టరీలకు కేంద్ర ప్రభుత్వం నుండి ఏ విధమైన రాయితీలు రావడానికి, ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు ఎటువంటి నైపుణ్యాలు ఉండాలో వివరించారు. ఆ ఫ్యాక్టరీ దగ్గరలో ఉన్న ప్రజలకు ఆ నైపుణ్యాలు నేర్పించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎంపిడిఒ నాతి బుజ్జి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా నేషనల్ సైన్స్ డే వేడుకలు

సర్ సివి రామన్ జయంతి సందర్భంగా బుధవారం నేషనల్ సైన్స్ డే వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజానగరం ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నేషనల్ సైన్స్ డే సెలబ్రేషన్స్‌ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విసి ఆచార్య కె.పద్మరాజు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు రామన్ వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రిజిస్ట్రార్ జి.మురళీకృష్ణ, డాక్టర్ కె.నూకరత్నం రచించిన పైథన్ ప్రోగ్రామింగ్ ఫర్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ పుస్తకాన్ని విసి కె.పద్మరాజు ఆవిష్కరించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలోని విజేతలకు సర్టిఫికెట్లులను, జ్ఞాపికలను అందజేసి అభినందించారు.

దేవరపల్లి భాష్యం స్కూల్లో విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ పి.పేరయ్య నాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షబానా పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్ స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర తెలిపారు. డాక్టర్ సిహెచ్.తులసి, ఫిషరీస్ జిల్లా అధికారి వి.కృష్ణారావు, డాక్టర్ కె.సరళ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం పాఠశాల స్థాయిలో విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానం పట్ల ఆసక్తిని, పోటీ తత్వాన్ని పెంచాలని లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎ.మల్లేశ్వరరావు సైన్స్ ఉపాధ్యాయులను కోరారు. మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయిని బివివిఆర్ పద్మావతి, ఉపాధ్యాయులు డివిఎన్.దుర్గాప్రసాద్, వి.వెంకటేశ్వరరావు, సరితా రంజని, పివి రమణ పాల్గొన్నారు.

తాళ్లపూడి బల్లిపాడు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం డివికె.రాజు విద్యార్థులతో సైన్సు పరికరాలు తయారు చేయించి ప్రదర్శించారు. రాజ్యలక్ష్మి, వరలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రక్కిలంక పాఠశాలలో హెచ్ఎం కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సైన్సు దినోత్సవం నిర్వహించారు.

గోపాలపురం అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపల్ ఉమాదేవి ఆధ్వర్యంలో, రాజంపాలెం హైస్కూల్లో హెచ్ఎం సంపూర్ణ విజయం ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.



నన్నయ వర్శిటీల్లో పుస్తకాలను ఆవిష్కరిస్తున్న విసి పద్మరాజు



లాలాచెరువు పాఠశాలలో ఉపాధ్యాయు, విద్యార్థులో హెచ్ఎం



సభలో మాట్లాడుతున్న మంత్రి వేణు

అంగన్‌వాడీల సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం జక్కంపూడి సీతారత్నం మెమోరియల్ హాల్లో బుధవారం నిర్వహించిన అంగన్‌వాడీ ఆశా వర్కర్ల ఆత్మీయ సమావేశంలో మంత్రి వేణుగోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ పిల్లలు దేవునితో సమానమని బాల్య దశలో ఉన్న అటువంటి పిల్లలను సాకి వారు మంచి పౌరులుగా, ఆరోగ్య పరంగా ఎదుగుదలకు తోడ్పడే పౌష్టికాహారం అందించడంతో పాటు ఆటపాటలను నేర్పించి వారికి మార్గదర్శకులుగా ఉన్న మీ సేవలు వెలకట్టలేనివన్నారు. ఒకరిద్దరు పిల్లలను పెంచడంలో నానా అవస్థలు పడే ప్రస్తుత రోజుల్లో బాల్య దశలో ఉన్న అనేక మంది పిల్లలను సంరక్షించి, వారికీ సేవలు అందించడం హర్షించదగ్గ విషయం అన్నారు. పేదరికంలో పుట్టిన బిడ్డ కూలిగానే జీవించాలనే విధానానికి స్వస్తి పలికి వారు ఉన్నత చదువులను అభ్యసించే దిశగా సిఎం జగన్మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి అత్యంత ప్రోత్సాహాన్ని అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నక్కా రాజబాబు, దంతంశెట్టి చిన్న వీరభద్రయ్య, పెయ్యల రాజేష్, తలారి వరప్రసాద్ పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి-చాగల్లు


చాగల్లు మండలం కలవలపల్లి గ్రామ శివారులో పోలీసులు మంగళవారం సాయంత్రం దాడి చేసి 100 లీటర్ల నాటు సారా, సారా తయారీకి ఉపయోగించే ఒక గ్యాస్ స్టవ్‌ను ఒక సిలిండర్‌ను స్వాధీన పరుచుకున్నారు.. ఆ ప్రదేశంలో దొరికిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.


ఉపాధ్యాయిని సుశీలను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఉపాధ్యాయిని సుశీల ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-కడియం

దుళ్ల మండల పరిషత్ పాఠశాలలో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించిన ఉపాధ్యాయిని సుశీల బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు వి.లజపతిరాయ్, ఏడిద నాగేశ్వరరావు మాట్లాడుతూ రెండు పర్యాయాలు, సుమారు 18 ఏళ్ల పాటు ఈ పాఠశాలలో పని చేసిన సుశీల సేవలు మరువలేనివన్నారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ప్రసాదరావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్బాయి, శాస్త్రి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత చిలుకూరి శ్రీనివాసు, ఎస్‌టియు నాయకులు సబ్బతి శ్రీనివాసు, నరేష్, ఉపాధ్యాయులు గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


రామకృష్ణకు నివాళి అర్పిస్తున్న మంత్రి వేణు

రామకృష్ణ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-కడియం

బుర్రిలంకలో ఇటీవల మృతి చెందిన ప్రముఖ నర్సరీ రైతు కొత్తపల్లి రామకృష్ణ కుటుంబాన్ని బుధవారం మంత్రి చెల్లుబోయిన వేణు పరామర్శించారు. తొలుత రామకృష్ణ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, వైసిపి రాష్ట్ర కార్యదర్శులు గిరజాల బాబు, దూలం వెంకన్న బాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్దాల అను, కడియం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, వైసిపి నాయకులు నక్కా రాజబాబు, తాడాల చక్రవర్తి, కొత్తపల్లి శివాజీ, కొత్తపల్లి మూర్తి, సాపిరెడ్డి సూరిబాబు ఉన్నారు.

సునీల్‌ను కలిసిన ఏడుకొండలు

ప్రజాశక్తి-గోకవరం

వైసిపి కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గుల్లా ఏడుకొండలు బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి తగు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి గుడాల రామకృష్ణ, ప్రత్తిపాడు ఎంపిపి క్రాంతి సుధాకర్, అన్నవరం ఎంపిటిసి దడాల సతీష్ కుమార్, మాజీ సర్పంచ్ గునిపే ఏడుకొండలు పాల్గొన్నారు.

గోకవరంలో జగనన్న పాలవెల్లువ

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం పంచాయతీలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమం ఎంపిడిఒ వసంత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైసిపి నాయకులు సుంకర వీరబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, వరసాల ప్రసాద్ పాల్గొన్నారు. పలువురు వైసిపి నాయకులు మాట్లాడుతూ సచివాలయం పరిధిలో 11 మంది సభ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి ఆ సభ్యుల ద్వారా బయట మార్కెట్ రేట్ల కంటే ఎక్కువ రేటుకు పాలు కొనడం దీని ముఖ్య ఉద్దేశం అని చెప్పారు. తోలేటి రాంప్రసాద్, నరాలశెట్టి నరసయ్య, ఎపిఎం సునీత, కార్యదర్శి శ్రీనివాసరావు, అబ్రహాం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

కొవ్వూరు నియోజకవర్గ స్థాయిలో ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత పేర్కొన్నారు. బుధవారం కొవ్వూరులో సంస్కృత కళాశాల, సంస్కృత ఉన్నత పాఠశాల, ఎస్ఎఎన్ జెడ్‌పి బాలికొన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో 86.41 శాతం ఓటింగ్ నమోదైనట్లు తెలిపారు. నియోజకవర్గ సగటు కంటే తక్కువ పోలింగ్ జరిగిన పిఎస్‌ల వారీగా వివరాలు మీకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక స్వీప్ కార్యకలాపాలను చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లాలో గత ఎన్నికల్లో నియోజకవర్గాలవారీగా తక్కువ ఓటు నమోదు చేసిన పిఎస్‌లను గుర్తించి, రాజకీయా పార్టీలతో కలిసి అక్కడ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను చేపట్టాల్సి ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కలెక్టర్ వెంట కొవ్వూరు రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, తహశీల్దారు కె.మస్తాన్, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ పాల్గొన్నారు.


కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

నగరంలో టిడిపి, జనసేన భారీ ర్యాలీ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

టిడిపి, జనసేన కూటమితో వైసిపి పతనం ఆరంభమైందని టిడిపి రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు), జనసేన పార్టీ రాజమండ్రి సిటీ ఇంచార్జ్ అత్తి సత్యనారాయణ అన్నారు. ఎన్నికల శంఖారావంలో భాగంగా తాడేపల్లిగూడెం (ప్రత్తిపాడు)లో జరిగిన బహిరంగ సభకు రాజమహేంద్రవరం సిటి నియోజకవర్గం నుంచి బుధవారం టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, వేలాదిగా తరలి వెళ్లారు. 100 కార్లు, 1000 బైకులపై సుమారు 5000 వేల మంది ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్, అత్తి సత్యనారాయణ మాట్లాడారు. ప్రజలంతా మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. వైసిపిని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. తొలుత కోటిపల్లి బస్టాండ్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి ఆదిరెడ్డి శ్రీనివాస్, అత్తి సత్యనారాయణ, టిడిపి నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఉప్పులూరి జానకి రామయ్య తదితరులు పూలమాలు వేసి నివాళు లు అర్పించారు. ఉమామార్కండేశ్వర స్వామి ఆలయ చైర్మన్, వైసిపి నాయకులు ఇన్నమూరి ప్రదీప్ తాడేపల్లిగూడెంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.


రాజమహేంద్రవరంలో టిడిపి, జనసేన భారీ ర్యాలీ

స్కీమ్ వర్కర్లకు వేతనాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి -దేవరపల్లి

స్కీమ్ వర్కర్ల వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ డిమాండ్ చేశారు. బుధవారం దేవరపల్లిలో సిఐటియు మండల కార్యదర్శి భగత్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాజులోవ మాట్లాడారు. స్కీమ్ వర్కర్లకు ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని, వేధింపులు ఆపాలని కోరారు. మధ్యాహ్న భోజన వర్కర్లకు ఇచ్చే అరకొర వేతనం రూ.3000లో కూడా ప్రతి నెలా వేయడం లేదని, బిల్లులు సైతం ఇవ్వక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఒక పక్క జీతం రాక, మరోపక్క ఎదురు పెట్టుబడి పెట్టలేక సతమతం అవుతున్నారని అన్నారు. అంగన్వాడీలు 42 రోజులు సమ్మె చేసారని ప్రభుత్వం ఒప్పుకున్న సమ్మె కాలపు వేతనం నేటికీ ఇవ్వలేదని, సుమారు మూడు నెలలపాటు అంగన్వాడీల వేతనాలు లేక ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆశ వర్కర్లకు సైతం ఇచ్చే రూ.పది వేలు రెండు మూడు దఫాల్లో ఇవ్వడం వల్ల ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉండవల్లి కృష్ణారావు, రాజకుమారి, ఎం.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఘనంగా టైలర్స్ డే

ప్రజాశక్తి-చాగల్లు, తాళ్లపూడి, పెరవలి

చాగల్లు మండలం శ్రీ పొట్టి శ్రీరాములు టైలర్స్ సంఘం ఆధ్వర్యాన బుధవారం టైలర్స డేను సంఘం అధ్యక్షుడు మడెల్లి సుబ్బారావు, దొంగ రాజారావు ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. తొలుత చాగల్లు ప్రధానకూడలిలోని శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఆంజనేయులు, కెవి.నారాయణ, సిహెచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

తాళ్లపూడి టైలర్స్ సంఘం అధ్యక్షుడు వంబోలు పోసిబాబు విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

పెరవలి మండలం కానూరులో టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు కొమ్ము శ్యామలరావు మాట్లాడారు.


చాగల్లులో విలియం హోకు టైలర్ల నివాళి

కార్మికుల వేతనాల పెంపుదలకు డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వలసపాకలో పంచా యతీ కార్మికుల వేతనాలు గత రెండేళ్లుగా పెంపుదల చేయడం లేదని తక్షణమే జీతాలను పెంపుదల చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ సత్యనారాయణకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు రూరల్ కన్వీనర్ టి. రాజా, కో- కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ వలస పాకల పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు గత రెండు సంవత్సరాల నుంచి వేతనాలు పెంచలేదన్నారు. పంచాయతీకి పరిశ్రమల ద్వారా లక్షలాది రూపాయలు ఆదాయం వస్తున్న కార్మికులకు మాత్రం వేతనాలు పెంచడం లేదన్నారు. పంచాయతీ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంగరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భీమిరెడ్డి కుటుంబానికి మంత్రి వేణు పరామర్శ

ప్రజాశక్తి-కడియం

సతీ వియోగంతో బాధ పడుతున్న మండలంలోని పొట్టిలంక గ్రామానికి చెందిన రాష్ట్ర శాప్ డైరెక్టర్, భీమిరెడ్డి నాగేంద్రను మంత్రి చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ బుధవారం పరామర్శించారు. భీమిరెడ్డి శేషారత్నం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాగేంద్రను ఓదార్చి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, గిరజాల బాబు, వై.స్టాలిన్, ఈలి గోపాలం తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

బాబూ రాజేంద్రప్రసాద్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-తాళ్లపూడి

దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ జీవితాన్ని నేటి విద్యార్థులు యువతీ యువకులు ఆదర్శంగా తీసుకోవాలని రాగోలపల్లి ఎంపిపి స్కూల్ హెచ్ఎం దున్నా దుర్గారావు అన్నారు. రాజేంద్రప్రసాద్ వర్ధంతి సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ చిన్నతనం నుంచీ రాష్ట్రపతి స్థాయికి రాజేంద్రప్రసాద్ అంచలంచెలుగా ఏ విధంగా ఎదిగిందీ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయునితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


పోలీస్ స్టేషన్ సందర్శించిన డీఎస్పీ రామారావు

పోలీసు స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-గోపాలపురం

కొవ్వూరు డిఎస్‌పి కెసిహెచ్.రామారావు గోపాలపురం పోలీస్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు ఎటువంటి గొడవలు లేకుండా ఎన్నికలు జరిగే విదంగా పోలీసులకు సహకరించాలని సూచించారు. నామినేషన్లు, ఎన్నికల సమయంలో శాంతియుతంగా జరిగేందుకు సిసి కెమేరాల పర్యవేక్షణ ఉంటుందని, గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈయన వెంట ఎస్ఐ కర్రి సతీష్ కుమార్ సిబ్బంది ఉన్నారు.

యానాం వార్తలు


లాప్‌టాప్‌లతో విద్యార్థులు

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎస్‌టిపిపి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌ట్యాప్‌లను ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పంపిణి చేశారు. స్థానిక కళాశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పుదుచ్చేరి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ద్వారా ఈ ల్యాప్‌టాప్ లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్దులకు నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ల్యాప్ టాప్‌లను అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ల్యాప్‌టాప్‌లను విద్యార్థులు కేవలం విద్యాపరంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ విషయంలో తల్లిదండ్రులు జాగ్రతలు వహించాలని కోరారు. త్వరలో జరగబోయే పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని అన్నారు. పరీక్షలకు సమయం తుక్కువగా ఉందని, విద్యార్థులు సమయం వృథా చేయకుండా చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునుస్వామి, సర్వశిక్షా అభియాన్ అధికారి కమిడి ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపల్ కె.ఉమ, పిఇటి పాలికి స్వామి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.


పింఛన్ మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎంఎల్ఎ అశోక్

ఘనంగా వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక చిల్డ్రన్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొని 95 మందికి వృద్దాప్య ఫించన్లు, 90 మందికి వికలాంగ ఫించన్ల మంజూరు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు మానసికంగా ధృడంగా ఉండాలని కోరారు. వికలాంగులకు అన్ని విధాలా అండగా ఉంటానని తెలిపారు. అనంతరం ఆటల పోటీలలో విజేతలకు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పరిపాలనాధికారి ఆర్.మునుస్వామి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రెయ్య శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతూ డాక్టర్ సునీల్

పల్స్ పోలియోపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం సచివాలయంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన సదస్సు ఎంపిహెచ్ఇఒ ఎన్.మూర్తి ఆధ్వర్యంలో డాక్టర్ సునీల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ మండలంలోని 41 బూత్‌లు, ఒక మొబైల్, ట్రాన్సిట్‌లలో మండలం మొత్తం 6,412 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. మొత్తం 174 మంది వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. మార్చి 3న జరిగే పోలియో చుక్కలు కార్యక్రమానికి మెటీరియల్ అందరికీ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిఖిత, గోకవరం ఎంపిహెచ్ఇఒ శంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసేందుకే 'పొత్తు' డ్రామా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

40 సంవత్సరాలు రాజకీయాల్లో ఉన్న చంద్రబాబు పచ్చి మోసగాడని, ప్రజలను నమ్మించి మోసం చేయడమే ఆయన నైజం అని ఎంపీ, వైసిపి సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ ఘాటుగా విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..'బాబు వస్తే జాబు గ్యారంటీ' అని 2014లో టిడిపి ఇచ్చిన స్లోగన్‌కు ప్రజలు.. ముఖ్యంగా నిరుద్యోగ యువత విశ్వసించి గెలిపించారన్నారు. బాబు అధికారంలోకి వచ్చారు.. చిన్న బాబు (లోకేష్) కు ఒకటి కాదు మూడు జాబులు వచ్చాయే కానీ..రాష్ట్రంలో ఒక్కరికంటే ఒక్క నిరుద్యోగికి జాబ్ రాలేదన్నారు. జాబు రాకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానన్నారు. ఒక్కరికి కూడా భతి ఇవ్వలేదన్నారు. డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చేస్తానని, రైతులకు రుణమాఫీ చేస్తానని చంద్రబాబు చెవులు చిల్లుపడేలా హోరెత్తించారే తప్పిస్తే రుణమాఫీ చేయలేదన్నారు. టిడిపి ఏమి చేసిందని ప్రజలు ఓటెయ్యాలని ఎంపీ భరత్ ప్రశ్నించారు. వైసిపి రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించిందని, అభివృద్ధి చేసి చూపిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో సమర్థవంతంగా అమలు చేశారని చెప్పారు. ప్రజల ఆశీస్సులతో మరోసారి జగన్ సిఎంగా గెలవడం ఖాయమని అన్నారు. రాష్ట్రంలో జనసేన పార్టీకి గత ఎన్నికల్లో ఓట్ షేర్ 6-7 శాతం ఉందని దాన్ని టిడిపి ఖాతాలో వేసుకునేందుకే పవన్ కల్యాణ్‌తో మైత్రి ఉన్నట్టు చంద్రబాబు నటిస్తున్నారని ఎంపీ భరత్ ధ్వజమెత్తారు. చంద్రబాబును సిఎం చేయడానికి పవన్ ఆరాటపడుతున్నారే తప్పిస్తే.. జనసేన శ్రేణుల ఆలోచనలు, ఆశలు, నిర్ణయాలను పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు.

పిఠాపురం బరిలో జనసేనాని..?

ఖాయమంటూ జోరుగా ప్రచారం
రసవత్తరంగా మారనున్న రాజకీయం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీ చేస్తున్న స్థానంపై ఎట్టకేలకు క్లారిటీ వచ్చింది. కాకినాడ జిల్లా పిఠాపురం నుంచే ఆయన బరిలో నిలుచుంటారని ఆ పార్టీ శ్రేణులు స్పష్టం చేస్తున్నాయి. ఉమ్మడి అభ్యర్థిగా ఆయన పోటీ దాదాపుగా ఖాయమైనట్లుగా నియోజకవర్గంలో ప్రచారం జోరుగా సాగుతోంది. తొలుత ఆయన భీమవరం నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. ఇటీవల అధినేతల ఇద్దరి మధ్య జరిగిన చర్చల సందర్భంగా పిఠాపురం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్లు పవన్ తేల్చి చెప్పడంతో ఇక పోటీ పక్కా కావడంతో పిఠాపురం రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. రాష్ట్రంలోనే విలక్షణ రాజకీయాలకు ఈ నియోజకవర్గం పెట్టింది పేరు. ఓటర్లు కూడా ప్రధాన పార్టీల కన్నా ఇతరులకే పట్టం కట్టడం ఆనవాయితీగా వస్తోంది. అందుకే ఈ నియోజకవర్గం ఎప్పుడూ చర్చనీయాంశంగానే ఉంటుంది.

నియోజకవర్గంలో సుమారు 2.30 లక్షల మంది ఓటర్లున్నారు. వీరిలో పవన్ కల్యాణ్ సామాజిక తరగతికి చెందిన వారే దాదాపు 92 వేల మంది ఉన్నారు. గతంలో ప్రజారాజ్యం విజయం సాధించిన నియోజకవర్గం కావడంతో మరోసారి జనసేనకు అవకాశం ఉంటుందనే అంచనాలతో జనసేన ఉంది. ఈ నేపథ్యంలోనే ఇక్కడ నుంచి పోటీ చేస్తే తప్పకుండా విజయం సాధించవచ్చునని పవన్ భావిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 6 నుంచి 7 అసెంబ్లీ సీట్లలో, కాకినాడ పార్లమెంటు నుంచి జనసేన పోటీ చేసే అవకాశం ఉండడంతో పవన్ ఇక్కడ పోటీ చేయడం ద్వారా ఆ నియోజకవర్గాలపై కూడా ప్రభావం చూపి విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని శ్రేణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆది నుంచి జనసేన కాకినాడ జిల్లాపై దృష్టి పెట్టింది. వారాహి యాత్ర కూడా ఇదే జిల్లా నుంచి ప్రారంభించారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ మూడు రోజులు పాటు బస చేసి సమీక్షలు జరిపారు. వచ్చే ఎన్నికల్లో బరిలో నిలుచునేందుకు తగ్గట్టుగా ఆ పార్టీ నాయకత్వం ఏర్పాట్లు చేస్తోంది. పవన్ కళ్యాణ్ పర్యటనకు అనుకూలంగా నియోజవర్గ పరిధిలో ఉన్న గొల్లప్రోలులో సుమారు 4 ఎకరాల స్థలాన్ని హెలిప్యాడ్ కోసం లీజుకు తీసుకున్నారు. పవన్ ఇక్కడ ప్రచారం చేసేందుకు వీలుగా బస ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

విలక్షణ తీర్పు ఎవరివైపు

ఈ నియోజకవర్గంలో 1989 తర్వాత కాంగ్రెస్, 1994 తర్వాత టిడిపి గెలిచిన దాఖలాలే లేవు. 2014 ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన టిడిపి తిరుగుబాటు అభ్యర్థి ఎస్‌విఎస్ఎస్.వర్మ విజయం సాధించగా, అంతకుముందు 2009లో ప్రజారాజ్యం తరుపున వంగా గీత ప్రాతినిధ్యం వహించారు. 2004లో బిజెపి అభ్యర్థిగా పెండెం దొరబాబు, 1999లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా సంగిశెట్టి వీరభద్రరావు విజయం సాధించారు. గత ఎన్నికల్లో (2019) వైసిపి నుంచి పెండెం దొరబాబు గెలుపొందారు. దీంతో గడిచిన మూడు దశాబ్దాలుగా విలక్షణ తీర్పులతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో ఓటర్ల వైఖరి ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇదిలా ఉండగా ఈసారి ఎన్నికలకు ఉమ్మడి అభ్యర్థిగా మాజీ ఎంఎల్ఎ వర్మ టికెట్ ఆశిస్తున్నారు. జనసేన ఇన్‌చార్జ్ ఉదయ శ్రీనివాస్ తనకే టికెట్ అంటూ నియోజవర్గం అంతా ఇప్పటికే ప్రచారం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అనూహ్య మార్పులు చోటు చేసుకోవడంతో వీరు ఇద్దరి ఆశలపై నీళ్లు చల్లినట్లు అయింది. వైసిపి నుంచి కాకినాడ ఎంపి వంగా గీత బరిలో ఉంటున్నారు. ఆమె గతంలో ప్రజారాజ్యం తరపున ఇక్కడే ఎంఎల్ఎగా గెలిపొందారు. ఆ అనుభవంతో నియోజకవర్గంలో ఉన్న పరిచయాలతో ఆమె గెలుపుపై ధీమాను వ్యక్తం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్‌ను సైతం ఓడించి తప్పకుండా విజయం సాధిస్తానని అంచనాతో ఆమె వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పిఠాపురం రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల్లో కనిపిస్తున్న తీవ్రమైన పోటీ చివరకు ఎలాంటి ఫలితాలనిస్తుందో వేచిచూడాల్సిందే.

